



ఆనందుడు ఓ రాయిమీద కూర్చుని రొప్పుతూ చుట్టూ చూశాడు. చిక్కటి అరణ్యం, విస్తరించి వెదజల్లుకుపోయిన పొదలు, ఎండుటాకులతో కప్పబడిన నేల తప్ప ఇంకేం కన్పించడం లేదు. అక్కడక్కడ చెట్ల సందులనుండి చొచ్చుకువచ్చిన సూర్య కిరణాలు కొద్దో, గొప్పో వెలుతుర్నిస్తున్నాయి. పక్షుల కిలకిలారావాలూ, కుందేళ్ళు పరిగెడుతూ వుంటే ఆకుల గలగలలూ, గాలికి చెట్లు ఊగేరొదా కొత్తఅనుభూతినిస్తున్నాయి. మధుర వాసనలతో మిళితమైన చల్లని వాయువులు అతని అలసటను కొంత వరకూ తీర్చగలిగాయి. ఈ వాతావరణం, ఈ చెట్లు, పక్షుల కిలకిలా రావములు ఆనందుడికి చాలా ఆత్మీయంగా కనుపించాయి. 'ఇక్కడ నీ బ్రతుకు నీవే బ్రతుకు, ఇంకొకళ్ళ బ్రతుకు నీవు బ్రతకక్కర్లేదు' అని చెప్తున్నట్టు అన్పించింది. ఆనందుడు హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. తన జీవితంలో ఇంత హాయిగా, స్వేచ్ఛగా యెప్పుడూ ఊపిరి పీల్చలేదు.

ఆనందుడు దాహంగా వుంటే చుట్టూ చూశాడు. నీళ్ళు తన చూపుమేరలో యెక్కడా వున్నట్టులేవు. అతనికి నవ్వొచ్చింది. రెండు రోజులనుండీ ప్రాణాలను చేతులలో పెట్టుకుని మానవ ప్రపంచాన్ని వదలి పరిగెడుతూ ఈ అరణ్యం చేరుకున్నాడు. ఈ రెండు

రోజులూ కూడా అతనికి దాహం అని గానీ, ఆకలి అని గానీ ఆలోచన రాలేదు. తన జీవితం తనకు సమస్య అయినపుడు, తను ఇంకే అవసరం గూర్చి ఆలోచించలేకపోయాడు. జీవితానికి భద్రత కలిగినపుడు దాహం గుర్తుకొస్తోంది. అయినా తన జీవితానికి ఇంతవరకూ భద్రత యెందుకు లేకుండాపోయింది? ఆనందుడిలో ఆలోచనలు రేగాయి.

* * *

ఆనందుడు ఒక బానిస. అతని తండ్రీ, తాతా బానిసలే. అతని తాత యెవరో యిద్దరు రాజులకు మధ్య జరిగిన యుద్ధంలో సైనికుడిగా వున్నప్పుడు యుద్ధఖైదీగా పట్టుబడి బానిసగా మార్చబడ్డాడు. అప్పటినుండీ అతని సంతతి అంతా బానిసలుగానే వున్నారు. (ఇంకోలాగ వుండలేరు కనుక!) ఆనందుడు బానిసగా ముగ్గురి యజమానుల చేతులు మారాడు. ఏ యజమానికీ అతనంటే మక్కువ వుండేది కాదు. అందుకు నిదర్శనం అతను ఎప్పుడూ బహూమతిగానే యింకో యజమానివద్దకు పంపబడేవాడు. అతడు బలవంతుడు కాదు సరికదా పనిచేయటానికి కావలసిన నేర్పరితనంకూడా అతనిలో లేదు. అందుకు ప్రతిఫలంగా రోజూ అతడు చావును చవిచూపే దెబ్బలు తింటూవుండేవాడు. కానీ, ప్రతీ బానిసలాగే ఆనందుడు తన జీవితానికి పరమార్థాన్నేదీ వెతుక్కోలేకపోయాడు. అసలు ఆ ఆలోచనే అతనికి రాలేదు. అతనికి తెలిసిందేమిటంటే, ఎలాగో అలా బ్రతకడం ఎందుకంటే, ప్రతీ బానిసకూ బ్రతికివుండడమే ఒక సమస్య. యిక స్వేచ్ఛగా బ్రతకడమనే ప్రశ్నే లేదు. కానీ మెఱుపులా జరిగిన సంఘటన అతన్ని ఇంకో జీవితంలోకి తీసుకువెళ్ళింది.

ఒక రోజు ఆనందుడు యజమాని కొడుకుని ఆడిస్తున్నాడు. యజమాని కొడుకు విసిరిన బంతి వీధిలో పడింది. దాన్ని తెచ్చుకోడానికి ఆ కుర్రాడు వీధిలోకి పరిగెడుతూ ఓ రథంక్రింద పడిపోయాడు. ఇంతవరకే ఆనందుడు చూశాడు. ఆ తరువాతేమైందో ఆనందుడికి తెలీదు. బహుశ ఆ కుర్రాడు యేమయ్యాడో అనేదానికన్నా తనకు ఏమౌతుందో అనేది ఆనందుని సమస్య అయివుంటుంది. వెంటనే అతడు పరిగెట్టడం మొదలుపెట్టాడు. రెండు రోజులు పరిగెడుతూ అరణ్యం చేరుకున్నాడు.

* * *

"ఎవరు నువ్వు?" గంభీరంగా మాట విన్పించింది. ఆనందుడు తలెత్తి చూశాడు. ఈ అరణ్యంలోకూడ తన్ని ప్రశ్నించే మనిషి ఉంటాడనుకోలేదు. అసలు ఏ మనిషినైనా చూట్టం కానీ, పలుకరించడం కానీ అతనికి భయంగానే వుంది. ఎదురుగుండా నుంచుని

వున్న మనిషికూడా భయంకరంగానె వున్నాడు. చాల యెత్తుగా, లావుగా, బలిష్టంగా, నల్లగా వున్నాడు. చర్మం దళసరిగా మందంగా వుంది. కళ్లు ఎర్రగా వున్నాయి. జుట్టు బాగా పెరిగి, జడలు కట్టి నూనె లేకుండా ఉండడంవల్ల వింతగా రాగిరంగులో వున్నది. అతని శరీరం చుట్టూ వెంట్రుకలుతో కప్పబడిన దుప్పటి వుంది. చేతిలో పిడికత్తి కూడా వుంది. భుజాన నీటితిత్తి వేలాడుతోంది.

"ఎవరు నువ్వు?" మళ్ళీ ప్రశ్నించాడు.

ఆనందుడి కేం చెప్పాలో తోచలేదు. అతడ్ని చూస్తే తనని వెదకటానికి పంపించబడిన వ్యక్తిలా లేడు. ఏ బంది పోటో అయ్యుంటాడు అన్పించింది.

"నే ... ను ... బాని ... సని ... పారిపో ... యొచ్చాను ... దాహంగా వుంది.'' తడబడుతూ చెప్పాడు ఆనందుడు.

ఆ వ్యక్తి నీటితిత్తితో పోస్తుంటే ఆనందుడు నీరు త్రాగాడు.

"నీ పే రేమిటి?"

"ఆనందుడు."

''నాతోరా. నన్ను చార్వాకుడనిపిలు."

ఆనందు డతనితూడా బైల్దేరాడు. దగ్గర్లోనే అతని కుటీరం వుంది. చార్వాకుడు ఆనందుడికి తినడానికి పళ్ళు ఇచ్చాడు.

''చూడు, నేనూ ఒక బానిసనే. కొట్టు నుండి నూనె కొనితెస్తుంటె మధ్యలో చెయ్యి జారి నూనె ఒలికిపోయింది. యజమాని కొడతాడనే భయముకొద్దీ పారిపోయి యిక్కడకు వచ్చేశాను. ఇక్కడ యింకా నీలా ముగ్గు రున్నారు. ముందు పళ్ళు తిని పడుకో. తర్వాత మాట్లాడుకుందాం. అతడు వెళ్ళిపోయాడు. ఆనందుని హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. తన జీవితంలో యింత ఆప్యాయంగా మాట్లాడినవారు ఎవరూ లేరు. ఈ సమయంలో ఇలాంటి ఆదరణ కన్నా, తను కోరే దేముంది? ఆనందుడు హాయిగా నిద్రపోగలిగాడు.


*   *   *

ఆనందుడు నిద్ర లేచేప్పటికి ఎవరో మాట్లాడుతున్నట్టు అనిపించింది. కుటీరంలోనుండి బయటకు వెళ్ళాడు. చార్వాకుడు, మరి యిద్దరు కూర్చుని మాట్లాడుతున్నారు. ఆనందుడ్ని చూచి చార్వాకుడు పిలిచాడు. ఆనందుడు వారిదగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

''చెప్పు! ఎందుకు పారిపో యొచ్చావు?" చార్వాకు డడిగాడు.

"నా యజమాని కొడుకు రథంక్రింద పడ్డాడు. అప్పుడు నేను ప్రక్కనే వున్నాను, నన్ను నా యజమాని చంపేస్తాడేమో నని భయం వేసి పారిపో యొచ్చాను:" ఆనందుడు చెప్పాడు.

''పారిపోయి ఏం చేద్దా మనుకున్నావు?"




ఆనందుడికి ఏం చెప్పాలో తోచలేదు. దాని గురించి అత నెప్పుడూ ఆలోచించలేదు. పారిపోతున్నప్పుడుకూడా అతనికి పారిపోతున్నట్టు అనిపించలేదు.

"బ్రతుకుదామని అనుకున్నాను," అన్నాడు ఆనందుడు.

చార్వాకుడు నవ్వాడు. "యింతటితో నీ జీవితానికి భద్రత యేర్పడలేదు. నీ కోసం ఝుప్పుడు చాలమంది వెదుకుతూ ఉండొచ్చు."

ఆనందుడికి భయం వేసింది. "మరి మీరు :" అని ప్రశ్నించాడు.

"మేమూ అంతే. మా జీవితాలకు కూడా భద్రత, స్థిరత్వం అనేవి యేవీ లేవు. మనకు తాత్కాలికంగా స్వేచ్ఛ దొరికింది గాని శాశ్వతంగా కాదు. మనకు వ్యతిరేకంగా యెన్నో సంఘ శక్తులు పని చేస్తున్నాయి. మనల్ని వెదుకుతూ వచ్చిన కొందరి సైనికుల్ని చంపగలిగినా, మళ్ళీ కొంతమంది రావచ్చును. అంచేత అంతటితో మనసమస్య అంతం కాదు. వాళ్ళనుకూడా చంపగల్గినా యింకా వస్తూనేఉంటారు. ఒకవేళ మనం శాశ్వతంగా యిక్కడ ఉండిపోగల్గినా మన యీ వర్గసమస్య ఇప్పటితో అంతం కాదు. మనలాటివాళ్ళు యింకా చాలామంది వున్నారు. వాళ్ళు బాధలు పడుతూనేవుంటాప.

ఆనందుడు ఆశ్చర్యపోయాడు. ఇది వర్గ సమస్య ఎందుకయిందో అతనికి అర్థం కాలేదు. యజమాను లుంటారు, బానిస లుంటారు; యజమానుల కోసం బానిసలు పనిచేస్తారు. యిది సామాజిక సూత్రం. యిందులో బానిసలకు సమస్య యేముంది ?


చార్వాకుడు ఆనందుడికేసి చూశాడు. "నువ్వెందుకు ఆశ్చర్యపోతున్నావో నాకు తెలుసు. నేను పుట్టుకతో పై వర్గానికి చెందినవాణ్నే. కానీ అప్పులబాధ వల్ల బానిసనై పోయాను. ఏ సామాజిక సూత్రం నన్ను బానిసను చేసింది ? నా ఆర్థిక బలహీనత. బానిసకు, యజమానికి వున్న తేడా ప్రకృతికి సంబంధించినది కాదు. యీ తేడా యీ మానవుల్లోని ఒక వర్గం సౌకర్యంకోసం సృష్టించింది. దీన్ని సమర్థించడానికి ఆ వర్గం ఎన్నో శాస్త్రాలను సృష్టించింది. ఆర్థికశాస్త్రం న్యాయశాస్త్రం, తత్త్వశాస్త్రం – యివన్నీ ఈ తేడాను బలపరచడానికి వారు సృష్టించినవే. మనంకనుక తిరుగుబాటు చేస్తే అణచడానికి వారు యివన్నీ ఉపయోగించుకుంటారు. ఖచ్చితంగా వాళ్ళు గెలుస్తారు. అందుకు కారణం నువ్వు అనుకున్నట్టు ప్రకృతి వారిని మనకన్న గొప్పగా సృష్టించడమూ కాదు, మన హీనత్వమూ కాదు. అందుకు కారణం వారి ఆర్థిక పునాదిమాత్రమే."

"యీ తేడా దేముడు సృష్టించిందని మన శాస్త్రాలు చెబుతున్నాయి. మన పూర్వజన్మసుకృతాన్నిబట్టి మన పుట్టుక ఆధారపడివుంటుంది. మనం మనిషిగా పుట్టవచ్చు, లేదా చెట్టుగా పుట్టవచ్చు. ఈ తేడా ప్రకృతిలోనే వుంది. యింతకన్నా యెక్కువ అర్థం చేసుకోలేకపోతున్నాం," అన్నాడు కూర్చున్న యిద్దరిలో ఒకడు.

"అవును, యీ వాదాన్ని చూపే మన నోరు కట్టేశారు వారు. యిదికూడా వారి సౌకర్యంకోసం సృష్టించబడిందే. భగవంతుడు అనేపదం వారికి చాల అండగా వుంది. భగవంతు డసలు ఉన్నాడా లేదా అనేది తేలవలసినప్రశ్న."

ఆనందుడు ఉలిక్కిపడ్డాడు. "భగవంతుడు లేకపోతే మనం యెలా వున్నాం?"

"కాదు, మనం ఉన్నందువల్ల భగవంతుడు ఉన్నాడు. మనం భగవంతుని సృష్టికాదు. భగవంతుడు మన సృష్టి. అసలు పదార్థం అనేదే వుంది. అది అనాదిసిద్ధం అయినది. పాలలోనుండి కమ్మటిపెరుగు, ఆ పెరుగునుండి వుల్లని మజ్జిగా, వెన్నా వచ్చినట్లు యీ పదార్థం మారుతూ వచ్చింది. ఆ పరిణామంలోనే మానవుడు వుద్భవించాడు. ఒకవేళ దేముడేగనుక ఈ జగత్తుని సృష్టించి వుంటే అతడు యిష్టం ఉండి సృష్టించాడా? యిష్టం లేకుండా సృష్టించాడా ? యిష్టం వుండి సృష్టిస్తే మనం అనుకున్నట్టు అతడు సంపూర్ణుడుకాడు. యెందుకంటే లోపం వుంటేనే కోరిక పుడు



"ఎందుకు లేవాలి? కార్పొరేషన్ బెంచీ నీ బాబుదా?"

తుంది. ఇష్టం లేకుండా సృష్టిస్తే అతడు పసిపిల్లవాడో, పిచ్చివాడో అయ్యుండాలి. ఇంతా అయినా అతనిలో యేదో ఒక లోపం వుండనేది నిజమౌతుంది. దేవుడు నిర్గుణుడు, నిరాకారుడు అని కదా నిర్ణయించింది. నిర్గుణునినుండి ఉద్భవించిన ఈ జగత్తులో ప్రతీ వస్తువుకి ఏదో ఒకగుణం ఉండనేవుంది. యిలా చూసినా దేవుడుగురించి నమ్మశక్యంగా లేదు.

ఆనందుడికి చార్వాకుడు చెప్పేవి అర్ధంకాలేదు; సత్యదూరం అన్పించింది. అయినా అతని వ్యక్తిత్వంలో యేదో ఆకర్షణను అనుభవిస్తున్నాడు.

చార్వాకుడు తన సంభాషణను పొడిగించాడు. "చూడండి యిప్పుడు కురుక్షేత్రయుద్ధము జరిగింది. పద్ధెనిమిది అక్షౌహిణుల సైన్యం పాల్గొన్నారు. ఈ యుద్ధం యెందుకు జరిగింది? యిందులో ఆ పద్ధెనిమిది అక్షౌహిణుల సైన్యానికి ఏవిధమైన పాత్ర వుంది? న్యాయానికిది అన్నదమ్ముల మధ్య రాజ్యంకోసం జరిగే పోరాటం. యిది పూర్తిగా వారికి సంబంధించినది; కానీ, యిందులో పద్ధెనిమిది అక్షౌహిణుల సైన్యము నాశనమయింది. దీన్ని శ్రీకృష్ణుడు ధర్మానికీ, అధర్మానికీ, న్యాయాన్యాయులకూ మధ్య పోరాటంగా చిత్రిస్తున్నాడు. ఈ

యుద్ధాన్ని భూభారాన్ని తగ్గించే మహా కార్యంగా వర్ణిస్తున్నాడు. ఒక రాజకీయ కారణానికి తాత్త్విక రూపాన్ని ఇస్తు న్నాడు. చూశారా! ఒక రాక్షస కార్యాన్ని యెలా సమర్థించగలరో! ఈ సమాజం మారేకొద్దీ వారి తాత్త్విక శాస్త్రాన్ని వారు మారుస్తూనేవచ్చారు. వేదాలలో అప్పటివారు ప్రకృతిశక్తుల్ని భగవంతు డిగా ఆరాధించినట్టుగా వుంది. తరువాత ఉపనిషత్తులలో దేముడు నిర్వికారుడు గానూ, నిరాకారుడుగానూ, నిర్గుణుడు గానూ మారిపోయాడు. మోక్షం జ్ఞానం ద్వారా తప్ప సాధించలేమని ఉపనిషత్తు లలో వుంది. యిప్పుడు శ్రీ కృష్ణుడు జ్ఞానంతో పాటు కర్మకూడా చేయాలని చెప్పాడు. అలా అంటేనే కాని ఈ యుద్ధానికి తాత్త్వికవిలువ ఉండదు. అందువల్ల వారి వర్గసౌకర్యాలకోసం వారు ఈ శాస్త్రాలను అండగానే ఉంచు కున్నారు. మార్చుకున్నారు. వీటిని మనం నమ్మకూడదు."

"అయితే మన వర్గశ్రేయస్సు కోస రము మనం ఏంచేయాలి?" అని అడి గాడు కూర్చున్నవారిలో ఒకడు.

"ఇప్పు డేం చెయ్యలేం," అన్నాడు చార్వాకుడు. "యిప్పుడు మనం తప్పక ఓడిపోతాం. చంపబడతాం. వీరు మన వర్గాన్ని నాశనం చేయరు. ఎందుకంటే మనవర్గంమీద వారు బ్రతుకుతున్నారు. కానీ మనలాటివాళ్ళను చంపేస్తారు. కానీ ... ఈ సమాజం మారుతూనే వుంటుంది. యెన్నో దశలు వస్తాయి. ఎప్పుడోఅప్పుడు మనది పైచేయి అవు తుంది. మనం జయిస్తాం."

ఆనందుడు చార్వాకుడికేసి ఆశగా చూశాడు. అతని ముఖంలో నిర్భయం కనిపించింది. ఆనందు డనుకున్నాడు. "యింత భయంకరమైన మనిషిలో యెంత అందం వుంది?"

ఇంతలో యింకొక వ్యక్తి వచ్చాడు. అతడూ పారిపోయివచ్చిన ఒక దానిసే. అతను చార్వాకునితో యిలా చెప్పాడు. "రేపు హస్తినాపురంలో ధర్మరాజుకి పట్టాభిషేకం జరుగుతోంది. ప్రక్క గ్రామంలో అనుకుంటున్నారు," అన్నాడు.

ఆనందుడికి అస్పష్టమైన వుద్రేకం వచ్చింది. "లోకంలో అన్యాయాలు జరిగిపోతూనే వున్నాయి. అయినా వారు పట్టాభిషేకాలు చేసుకుంటూనే వున్నారు."

రాత్రి అందరూ చెట్లక్రింద పడుకు న్నారు. ఆనందుడికి నిద్రపట్టలేదు. మెల్లిగా లేచాడు. ఈ రాత్రి నడిస్తే రేప టికి హస్తినాపురం చేరగలను. అస్పష్టంగా గొణుక్కున్నాడు.

* * *

హస్తినాపురం అంతా కోలాహలంగా వుంది. రాజవీధు లన్నీ అలంకరించారు.

ప్రజ అంతా రాజవీధికి యిరుప్రక్కలా నిలబడివున్నారు. ధర్మరాజుకి జయ జయధ్వానాలు మ్రోగుతున్నాయి. ఆనం దుడు గుంపును త్రోసుకుని ముందుకు వెళ్ళి నించున్నాడు. రాజవీధిగుండా ఏనుగు అంబారీపై ధర్మరాజు వూరేగు తున్నాడు. అతని వెనుక అతని సోద రులు నిలబడివున్నారు. ధర్మరాజు ప్రక్క ఆసనంమీద శ్రీకృష్ణుడు కూర్చుని వున్నాడు. ఆనందుడు రాగానే శ్రీకృష్ణుణ్ణి పరిశీలనగా చూచాడు. శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ వున్నాడు. నల్లగా వున్నా ఆ నలుపులో యెంతో ప్రకాశం వుంది. అతడు బలంగా వున్నా ఆ బలంలో సుకుమా రము వుంది. అతని కిరీటం విలువైన రాళ్ళు పొదగబడి ప్రకాశిస్తోంది. పైన నెమలిపింఛం అందాగా వున్నది. ముఖ్యంగా అతని నవ్వు చాల అందంగా వుంది. చేతిలో మురళి పట్టుకున్నాడు. ఆనందుడు శ్రీకృష్ణుణ్ణి చాల్సేపటితో పోల్చకుండా వుండలేకపోయాడు. అతడు యెంత భయంకరుడో అంత ఉన్నతమైనవాడు. ఈతడెంత అంద మైనవాడో అంత నీచుడు.

అంబారీ దగ్గరగా వచ్చింది. ఆనం దునికి ధర్మరాజుని చూస్తున్నకొద్దీ అస హ్యము పెరిగిపోయింది. అతనికి తెలియ కుండానే ఒక్కసారి అంబారీ ముందుకు వెళ్ళి ఆనందుడు అరిచాడు: "ఓ ధర్మ రాజా! కౌరవులు చేసినదానికన్నా నీ అన్యాయం తక్కువ కాదుసుమా!"

ఒక్కసారి ప్రజ అంతా దిగ్భ్రమ జెందారు. ధర్మరాజు ఆశ్చర్యంగా ఆనం దుడి కేసి చూచి శ్రీకృష్ణుడి కేసి తిరి గాడు, 'ఏమిటిది?' అన్నట్లుగా. శ్రీ కృష్ణుడు చిర్నవ్వు చిందిస్తూ ఆనందుడి కేసి చూచి ధర్మరాజుతో "ఈతడు ఒక రాక్షసుడు. ఇతన్ని వెంటనే చంపండి." అన్నాడు.

ఒక సైనికుడు కత్తి దూసి ఆనందుడి కేసి వచ్చాడు. ఆనందుడు శ్రీకృష్ణుని కేసి చూస్తూ, "ఈవేళ నేను చచ్చిపో వచ్చు. కానీ భవిష్యత్తులో ప్రపంచం నావెంటనే వస్తుంది. నేను తప్పక జయిస్తాను," అన్నాడు.

ఆ సైనికుడు వెంటనే ఆనందుని తలను నరికేశాడు. శవాన్ని వీధిలో నుండి బయటకు ఈడ్చేశారు. అంబారి ముందుకు సాగిపోయింది.

— —